సాక్షి ప్రకాశం

మంగళవారం | 29 | ఆగస్టు | 2023



అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. - 8లో..



క్రిప్టో కరెన్సీ పేరుతో మోసం

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని మెసేజ్‌లు పెట్టి డబ్బులు కాజేశారని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పెషలిస్ట్ డాక్టర్‌లకు రూ.15 వేలు అలవెన్స్

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్‌లకు జీతంతో పాటు స్పెషలిస్ట్ అలవెన్స్ కింద మరో రూ.15 వేలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 657ను విడుదల చేసింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యం డాక్టర్‌లకు ఈ అలవెన్స్ కేటాయించింది. దీనిపట్ల రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డాక్టర్ ఆర్ వేణుగోపాల్‌రెడ్డి స్పెషలిస్ట్ డాక్టర్‌లతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్‌లకే కాకుండా మూడు నెలల క్రితం సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్‌లకు రూ.30 వేలు అలవెన్స్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం వైద్య శాఖకు ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతోందన్నారు. ప్రభుత్వ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వ డాక్టర్లు కృషి చేస్తారని అన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలను పరిశీలిస్తున్న స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు

ఒంగోలు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక మినీ స్టేడియంలో జిల్లా క్రీడాభివృద్ధిశాఖ పలు క్రీడలను నిర్వహించింది. మార్కాపురం, గిద్దలూరు, కొత్తపట్నం, సంతనూతలపాడు మండలాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దాదాపు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన చిన్నారులను అభినందించారు. చీఫ్ కోచ్ రాజ రాజేశ్వరి మాట్లాడుతూ మంగళవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఆర్చరీ, ఉషు, బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, కరాటే, బాక్సింగ్, సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నామని, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు.



గిద్దలూరు మండలం బురుజుపల్లె గ్రామానికి చెందిన పోలా సుంకన్న గతంలో నాటుసారా తయారు చేసి జీవనం కొనసాగించేవాడు. సెబ్ అధికారులు పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయడంతో కడప జైలులో 4 నెలల పాటు జైలు శిక్ష అనుభవించాడు. భార్య, ఇద్దరు కుమారులను వదిలి దూరంగా ఉండలేక నరకం అనుభవించాడు. ''అడవుల్లో రాత్రి అనక పగలనక భయం భయంతో 10 రోజులు కష్టపడితే 40 లీటర్ల నాటుసారా కాచి దానిని విక్రయించగా వచ్చేది రూ.5 వేలు. అందులో ఖర్చులు పోగా మిగిలేది రూ.3 వేలు మాత్రమే. ఇంత కష్టపడి భార్యబిడ్డలకు దూరంగా ఇటువంటి పని చేయడం ఎందుకనే ప్రశ్న నాలో తలచి ఆ పని మానేసి మా చేతి వృత్తి అయిన బుట్టలు, తట్టలు, గంపలు, వంటివి ఇంటి వద్దనే తయారు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాను.'' అని తెలిపాడు.

సారాకు స్వస్తి

అవును వారు మారారు..



యర్రగొండపాలెం సర్కిల్ పరిధిలో నాటుసారా డ్రమ్ములను దహనం చేస్తున్న సెబ్ సిబ్బంది

దశాబ్దాలుగా నాటుసారా తయారీనే వృత్తిగా జీవిస్తున్న వారిలో పరివర్తన వస్తోంది. నాటు సారాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. జిల్లా అధికారులు సైతం వారిలో మార్పు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. తొలిదశలో విక్రయాలను అడ్డుకునేందుకు దృష్టి సారించారు. విక్రేతల్లో తొలుత అవగాహన కల్పించారు. అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తున్న విక్రయదారులపై పీడీ యాక్ట్, గ్రామ బహిష్కరణ వంటి చర్యలు తీసుకుంటున్నారు. నాటు సారాకు బలికావద్దంటూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. వారిలో పరివర్తన తీసుకొచ్చి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా నేడు సారా రక్కసి నుంచి గ్రామాలు, తండాలు బయట పడుతున్నాయి. నాటు సారాను వదిలి వ్యవసాయం, గొర్రెల, మేకల పెంపకం, బుట్టలు అల్లకం వంటి అనేక ఉపాధి అవకాశాల వైపు అడుగులు పడ్డాయి.. పడుతున్నాయి.

- ఆపరేషన్.. పరివర్తన్
- నాటుసారా రక్కసి నుంచి గ్రామాలకు విముక్తి
- తయారీ అరికట్టడమే లక్ష్యంగా ప్రణాళికలు
- జిల్లా వ్యాప్తంగా నాటుసారా తయారీదారులపై డేగకన్ను
- నాటుసారా వృత్తిదారుల్లో మార్పు
- ప్రత్యామ్నాయ ఉపాధి దిశగా అడుగులు
- పరివర్తన చెందని వారిపై పీడీ యాక్ట్
- మార్పు రాకుంటే గ్రామ బహిష్కరణలు



ఆపరేషన్ పరివర్తన పోస్టర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో మొత్తం 97 నాటుసారా గ్రామాలను గుర్తించిన అధికారులు వాటిలో దాదాపు అన్ని గ్రామాలను నాటు సారా రహితంగా తీర్చిదిద్దుతున్నారు. సారా తయారీ, అమ్మకాలను నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నాటు సారా స్థావరాలపై, విక్రయ కేంద్రాలపై అధికారులు దాడులు ముమ్మరం చేశారు. దశాబ్దాలుగా సారానే వృత్తిగా జీవిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేక కార్యాచరణను చేపట్టారు. అందుకోసం 'పరివర్తన 2.0' పేరిట ఇప్పటికే సారా తయారు చేసే గ్రామాల్లో పర్యటించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లలో సారాకు సంబంధించిన 1400 మంది నిందితులు ఉన్నట్లు గుర్తించి వారికి అవగాహన కల్పించారు. అనేక మందిని బైండోవర్ చేసుకొని అవగాహనా కార్యక్రమాల్లో కచ్చితంగా పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. అవగాహన కల్పించినా వినని వారిపై ప్రివెంటివ్ డిటెక్షన్(పీడీ) యాక్టులు కూడా విధించారు. కొంతమందిని గ్రామ బహిష్కరణకు కూడా గురిచేశారు.

దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నల్ల బెల్లంను నిషేధించడంతో కూడా సారా తయారీని అరికట్టడానికి ఎంతగానో దోహదపడింది. సారా రక్కసి నుంచి విముక్తి పొందిన వారికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే 132 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించారు. నాటు సారాను వదిలిని వారికి వ్యవసాయంతో పాటు గొర్రెలు, మేకలు, గేదెల పెంపకం, ఆటోలు, బుట్టలు అల్లకంతో పాటు అనేక రకాల ఉపాధి మార్గాలవైపు అడుగులు వేస్తున్నారు.

నాలుగేళ్లుగా ..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నాలుగేళ్లలో మొత్తం 180 నాటుసారా కేసులు నమోదయ్యాయి. మొత్తం 504 మందిని అరెస్టు చేశారు. మొత్తం 42 వాహనాలను సీజ్ చేశారు. తయారు చేస్తున్న సారా బట్టీలను, 2,63,310 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మొత్తం 5,227 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.

నల్ల బెల్లం అమ్ముతున్న 107 మంది వ్యాపారులను కూడా అరెస్టు చేశారు. నాటు సారాను అరికట్టడంలో అధికారులు చేపట్టిన కఠిన చర్యల్లో భాగంగా ప్రివెంటివ్ డిటెన్షన్(పీడీ) యాక్టు కింద 7 మందిపై కేసులు నమోదు చేశారు. నలుగురిని గ్రామ బహిష్కరణకు కూడా గురిచేశారు.

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు



నాటు సారానే జీవనంగా చేసుకున్న వారిలో పరివర్తన తీసుకొస్తున్నాం. ఆయా కుటుంబాల్లో మార్పు తీసుకొచ్చి జిల్లాలో నాటు సారా ఆనవాళ్లు లేకుండా చేస్తున్నాం. ఆ మేరకు అధికారులు, సిబ్బందిని సిద్ధం చేశాం. జిల్లాలో 97 నాటుసారా గ్రామాలను గుర్తించాం. అన్ని గ్రామాలను నాటు సారా రహితంగా తయారు చేశాం. కొత్తగా ఎవరైనా నాటు సారా వైపు ప్రయత్నిస్తే అలాంటి వారిని కూడా గుర్తించే పనిలో నిమగ్నమయ్యాం. ప్రజలకు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాం. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల మెరుగుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– మలికాగర్గ్, ఎస్పీ


దాడులు ఇలా



నల్లమల అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రచారం చేస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో ఆపరేషన్ పరివర్తన 2.0 కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. గత ఏడాది నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీస్‌లు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తున్నారు. ఈ కాలంలో మొత్తం 116 కేసులు నమోదు చేసి, 179 మందిని అరెస్టు చేశారు. 14 వాహనాలను సీజ్ చేశారు. తయారు చేస్తున్న సారాబట్టీలను, 53,270 లీటర్ల బెల్లం ఊట(ఐడీ)ను ధ్వంసం చేశారు. మొత్తం 1078 లీటర్ల నాటుసారా, 570 కేజీల బెల్లంను కూడా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న వర్తకులు 59 మందిని అరెస్టు చేశారు. గతేడాది మార్కాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంత నాటు సారాను బోడపాడు రెవెన్యూ విలేజ్ పరిధిలోని కొండ పోరంబోకు స్థలంలో గుంటతీసి గుంటలో పోసి పూడ్చేశారు.

ధైర్యంగా జీవిస్తున్నాం



గిద్దలూరు మండలం ఓబులాపురం తాండా గ్రామానికి చెందిన మూడావత్ గోపాల్ నాయక్ గతంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తూ జీవితాన్ని గడిపేవాడు. భయం భయంగా నాటుసారా తయారు చేస్తూ ఎక్కడ ఎవరు పట్టుకుంటారో అనే భయం ఉండేది. ఆ పని మానేసి రెండు సంవత్సరాలు అయింది. ఇప్పుడు ధైర్యంగా గొర్లను మేపుకుంటూ దర్జాగా బతుకుతున్నాడు. ''ఒక సారి నాటుసారా కేసులో గిద్దలూరు సబ్ జైలులో వారం రోజులు ఉన్నాను. ఆ వారం 6 నెలలు గడిపినట్లు బాధపడి జీవితంలో నాటుసారా తయారు చేయకూడదని భావించి నాటు సారా తయారీని పూర్తిగా వదిలేశాను. పూర్వీకుల నుంచి వచ్చిన ఇల్లు ఉంది. జీవనాధారం కోసం ప్రభుత్వం పొలం ఇప్పిస్తే వ్యవసాయం చేసుకుని జీవితాన్ని గడుపుతానని'' తెలిపాడు.

రాజకీయం అంటే పార్ట్‌టైం కాదు

- ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించడమే రాజకీయం
- విద్య, వైద్యం, ఆర్థిక చేయూతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి



లైవ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: రాజకీయం అంటే పార్ట్‌టైం కాదని, ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి అవసరాలకు అనుగుణంగా స్పందించడమే రాజకీయం అని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. గత రెండు దఫాలకు సంబంధించి రెండు సమస్యలు అవి కూడా ఒకటి భూమి పంపిణీ, రెండోది కోర్టులో లిటిగేషన్ ఉన్న సమస్య తప్ప మిగిలినవన్నీ పరిష్కరించామన్నారు. మొదటి దఫా కన్నా రెండో దఫాలో కరోనా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో తన తండ్రి పేరుమీద జర్మన్ షెడ్ వేయించడమే కాకుండా అందులోకి ఆక్సిజన్ సౌకర్యం, పౌష్టికరమైన ఆహారం సొంతంగా ఏర్పాటు చేశామన్నారు. తాను ప్రారంభించిన తరువాత చాలామంది ప్రజలను ఆదుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. నెల్లూరు నుంచి ఆనందయ్య మందు, రెమిడిసివీర్ ఇంజెక్షన్‌లు తెప్పించి ప్రజలకు అందించగలిగానన్నారు. యరజర్ల వద్ద ఏకంగా 27 వేల పట్టాలు పంపిణీ చేయడం ద్వారా శాటిలైట్ టౌన్‌షిప్‌ను నిర్మిద్దామనుకున్నామని, కానీ దుర్మార్గంగా కోర్టుకు వెళ్లి టీడీపీ నాయకులు స్టే తీసుకొచ్చి పేదల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. వాస్తవానికి ఆ భూమిలో ఇనుప ఖనిజం తవ్వేందుకు జింపెక్స్ కంపెనీ అనుమతులు పొందితే ఇనుప ఖనిజం తవ్వకుండా టీడీపీ నాయకులు నానాయాగీ చేశారన్నారు. దీంతో జింపెక్స్ కంపెనీకి అయిన వ్యయాన్ని చెల్లించి ప్రభుత్వం భూమిని ప్రజలకు పంపిణీ చేసేందుకు సిద్ధపడితే ఇనుప ఖనిజమంటూ టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించడం ద్వారా వారు పేదల పక్కన ఉన్నారా లేక పేదలకు శత్రువుగా ఉన్నారా అనేది అర్థం చేసుకోవచ్చన్నారు. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు వెచ్చించి భూములు కొనుగోలుచేసి ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గతంలో టిడ్కో ఇళ్లకు భూములు తీసుకునే సమయంలో టీడీపీ నాయకులు దారుణంగా మోసానికి పాల్పడ్డారని, తాము మాత్రం పూర్తి పారదర్శకంగా భూమి కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాడు-నేడు ద్వారా పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను, సాంకేతిక విద్యను అందుకునే అవకాశం కల్పించారని, ఇక వైద్యంలోను విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదరికం రూపుమాపాలనే ఏకైక లక్ష్యంతో పాలన సాగుతోందన్నారు. కరోనా సమయంలో అత్యధికంగా ఆర్యవైశ్యులు కరోనాకు గురైనా వారిని కాపాడుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోగలిగామన్నారు.

మంచి పేరు ఉంది కాబట్టే ఇన్నిసార్లు ప్రజాసేవ చేసుకునే అవకాశం కలిగిందన్నారు. కేవలం రోడ్డుమీద రోడ్లు వేయడం, కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్డు పక్కన భవనాలకు రంగులు వేసినంత మాత్రాన అభివృద్ధి అవుతుందా అని ప్రశ్నించారు. ఒంగోలులో శివారు కాలనీలన్నీ దాదాపు తన హయాంలో ఇచ్చినవే అన్నారు. ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ కాలనీల్లో ఓట్లు రావనే ఉద్దేశంతో కనీసం రోడ్లు , డ్రైనేజీ కూడా వేసేందుకు గత ఎమ్మెల్యే నిర్లక్ష్యం వహించారని, నేడు ఆ ప్రాంతంలో ఎంత మార్పు వచ్చిందో ఆ ప్రాంత ప్రజలు స్వయంగా గమనిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన టిడ్కో ఇళ్ల డబ్బు వాపసు కోరుతూ కాల్ చేసిన వారికి డబ్బు వాపసు, ఇంటి పట్టా, ఇల్లు కట్టుకునేందుకు రూ.2 లక్షల ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం ద్వారా అందిస్తానని బాలినేని వారికి హామీ ఇచ్చారు.

సైకోకు చిహ్నం దామచర్ల

- కరోనా సమయంలో గుర్తుకు రాని ముస్లింలు నేడు ఎందుకు గుర్తుకొస్తున్నారు
- ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి బాలినేని చూపిన చొరవ మరువలేం
- వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ సయ్యద్ జలీల్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు: సైకో అనే పదానికి చిహ్నం దామచర్ల జనార్దన్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ సయ్యద్ జలీల్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దామచర్ల జనార్దన్‌కు ముస్లింల మీద అమితప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. ముస్లింల ఆత్మీయ సమావేశం పేరుతో దామచర్ల జనార్దన్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం అన్నారు. కరోనా సమయంలో ఇస్లాంపేట పూర్తిగా లాక్‌డౌన్ అయి కనీసం తిండికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే బెంగళూరు లేదా హైదరాబాద్ ప్యాలెస్‌లలో ఉండిపోవడమేనా ప్రేమంటే అని నిలదీశారు. కరోనాకు రెండు సార్లు గురైనా బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం ముస్లింల కష్టాలన్నింటినీ తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు అండగా నిలిచారని, చివరకు కరోనాలోనే పండుగ చేసుకోవాల్సి వస్తే ప్రతి కుటుంబానికి అవసరమైన సరుకులు కూడా పంపి మానవత్వాన్ని ప్రదర్శించిన వ్యక్తి బాలినేని అన్నారు. ముస్లింల మీద ప్రేమ ఉందని చెబుతున్న దామచర్ల జనార్దన్ రంజాన్ పండుగ మాసంలో బండ్లమిట్టలోని ముస్లిం షాపులను ఎందుకు ధ్వంసం చేయించారో సమాధానం చెప్పాలన్నారు. షాపులవారు కనీసం కోర్టుకు కూడా వెళ్లే స్తోమత లేకపోతే వారిని బాలినేని ఆర్థికంగా ఆదుకున్నారని.. హైకోర్టులో ఎలాగైనా ముస్లింలను ఓడించాలని కంకణం కట్టుకుని మీ పార్టీ నేత బంగారయ్యను పంపిన విషయాన్ని ముస్లింలు మరువలేరన్నారు. షాదీఖానాకు రెండు కోట్లు ఖర్చుచేశామని చెబుతున్న జనార్దన్ ఆ డబ్బు దేనికి ఎంతెంత ఖర్చుచేశారో బహిరంగ పరచాలన్నారు. నేడు రూ.80 లక్షలు మళ్లీ ఖర్చుచేసినా సంతృప్తి చెందక ఇంకా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ షాదీఖానా నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది బాలినేని అన్నారు. ఇస్లాంపేటలో కమ్యూనిటీ హాలుకు బాలినేని స్వయంగా రూ.12 లక్షలు ఇచ్చారనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఖబరస్థాన్‌లో ప్రహరీ, లోపల గది నిర్మాణం, ఇంకా అనేక మౌలిక వసతులు కల్పించిన ఘనత బాలినేని, మాగుంట, కరణం బలరాంలది అన్నారు. ఒంగోలు శివారు కాలనీలలో పంపిణీ చేసిన పట్టాలలో కనీసం 15 నుంచి 20 శాతం ముస్లింలు ఉంటున్నారంటే అది బాలినేని వాసన్న ద్వారా పంపిణీ అయిన పట్టాలే అన్నారు. ముస్లింల అభివృద్ధిపై చర్చకు సవాల్ అంటూ జనార్దన్ విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని చెప్పారు. అద్దంకి బస్టాండులో ఎన్టీఆర్ సాక్షిగా లేదా తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురుగా అయినా చర్చకు వచ్చేందుకు తాము సిద్ధమని, దమ్ముంటే స్థలం, సమయం ప్రకటించాలని జలీల్ సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ కఠారి శంకర్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల మంజూరు చేయకుండానే ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలుచేసి ఆ మొత్తాన్ని ఏం చేశారో దామచర్ల ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జలీల్ నుంచి కనీసం వివరణ కూడా తీసుకోకుండా మీడియాలో ఇష్టం వచ్చినట్లు వార్తలు రాయడం సరికాదని, కనీసం వివరణ తీసుకోవాలని సూచించారు. దూదేకులకు ఆరామ క్షేత్రం కేటాయించడమే కాకుండా మొత్తం 18 ఆరామ క్షేత్రాలకు రూ.5 లక్షల చొప్పున బాలినేని సొంతంగా నిధులు ఇచ్చారని, వాటిలో ఎవరినీ రానివ్వడంలేదంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని జనార్దన్ మానుకోవాలని హితవు పలికారు. జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్, గంటా రామానాయుడు తదితరులు మాట్లాడుతూ ఒంగోలులో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని పెట్టాలని తలిస్తే దానికి అయ్యే మొత్తం వ్యయాన్ని భరించి ఏర్పాటుచేయించిన వ్యక్తి మా బాలినేని అని, ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే తిరిగి సమాధానం చెప్పేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.

ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకారాదు

- జిల్లాలో 47,350 మంది విద్యార్థులకు రూ.35 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం
- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఉన్నత చదువులు చదివేందుకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022-23 విద్యా సంవత్సరంలో మూడో విడత నిధులను అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో సోమవారం జమ చేసే సందర్భంగా చిత్తూరు జిల్లా నగరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా జిల్లాలో ప్రకాశం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు ఇతర అధికారులు పాల్గొని అర్హులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడతలో జిల్లాలో 47,350 మంది అర్హులైన విద్యార్థులకు రూ.35,39,96,419ల ఆర్థిక ప్రయోజనం కలిగిందని వివరించారు. వీరికి చెందిన 42,899 మంది తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల్లో ఎస్సీలు 12,537, ఎస్టీలు 1,258, బీసీలు 15,860, ఈబీసీలు 11,800, ముస్లిం మైనార్టీలు 3,086, కాపులు 2,756, క్రైస్తవ మైనార్టీలు 53 మంది ఉన్నట్లు తెలిపారు. త్రైమాసికం ముగిసిన వెంటనే ఈ పథకం కింద కాలేజీ ఫీజులు రీయింబర్స్ చేస్తున్నట్లు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఈ మూడు విడతల్లో కలిపి రూ.107,57,86,721 విడుదలైనట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నీ వర్గాల సంక్షేమమే వైఎస్ జగన్ లక్ష్యం అని అన్నారు. దీనిలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, ఇతర అధికారులు పాల్గొన్నారు.



జగనన్న విద్యా దీవెన చెక్కు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు మాదిగ తదితరులు

నెమ్మాని, మైనంపాటికి గిడుగు సాహిత్య సత్కారం నేడు

ఒంగోలు మెట్రో:

ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహిత్య వేత్త, నత్య రూపకాల రచయిత నెమ్మాని సీతారామమూర్తి, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ గిడుగు సాహిత్య సత్కార గ్రహీతలుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే తెలుగు భాషా దినోత్సవంలో వీరిని సత్కరించనున్నారు. ఆ మేరకు అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు నుంచి వారికి ఆహ్వానం అందింది.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీ నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ప్రకాశంభవనంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంభం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. 1వ తేదీ కంభంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 11 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ వెంకటేశ్వర్లు, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేతో అర్హులకు హక్కు పత్రాలు

- శిక్షణలో డీపీఓ నారాయణరెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపట్టిన స్వమిత్వ సర్వే ద్వారా గ్రామం కంఠంలో అర్హులైన గృహాలకు హక్కు పత్రాలు లభిస్తాయని, తద్వారా సదరు ఆస్తిని క్రయవిక్రయాలు, బ్యాంకు రుణాలకు అవకాశం లభిస్తుందని డీపీఓ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లకు సర్వేపై శిక్షణ నిర్వహించారు. శిక్షణలో డీపీఓ మాట్లాడుతూ గ్రామ కంఠంగా నిర్ధారించిన ప్రాంతంలో నివసించే వారికి యాజమాన్య హక్కు కల్పించేందుకు రీసర్వే చేపట్టి అధునాతన సాంకేతిక సహాయంతో గ్రామ పటాలు రూపొందించి కొత్తగా ఆర్ఓఆర్‌ను తయారు చేయడమే దీని లక్ష్యమన్నారు. స్వమిత్వలో చేసే ప్రతి కార్యక్రమాన్ని రిజిష్టర్‌లో నమోదు చేయాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎల్ఓ కిషోర్‌బాబు, జిల్లా నోడల్ అధికారి సుశాంత్, ఆనంద్ కుమార్, ఇతర అదికారులు పాల్గొన్నారు.

పశ్చిమాన సాహితీ సేద్యం

మార్కాపురం: భాష భావాల వ్యక్తీకరణ మాత్రమే కాదు, మానవ సంబంధాలను అభివృద్ధిపరిచే సాంస్కృతిక ప్రతిబింబం. జాతి ద్వారా భాషకు, భాష ద్వారా జాతికి ఒక విశిష్టమైన గౌరవం ఏర్పడుతుంది. ఒక జాతి పురోగమనాన్ని తల్లి భాష ముందుండి నడిపిస్తుంది. తెలుగు జాతి పురోగమనానికి ఛాందస భాషావాదులతో పోరాడిన తొలి వ్యక్తి గిడుగు రామమూర్తి. గ్రాంథిక భాషను పక్కకు నెట్టి సామాన్యులందరికీ అర్థమయ్యేలా వ్యావహారిక తెలుగు భాషకు జీవం పోసిన 'గిడుగు' జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా మనం నిర్వహించుకుంటున్నాం. కాలక్రమంలో ఎందరో సాహితీ వేత్తలు, కవులు, రచయితలూ గిడుగు పథంలో 'పదం' కలిపి కలాలు కదిలించారు.

- కవులు, కళాకారులకు నిలయంగా పశ్చిమ ప్రకాశం
- పలు పుస్తకాలు, సాహిత్య వ్యాసాలతో తెలుగు భాషా వికాసానికి కృషి
- నేడు మాతృభాషా దినోత్సవం



కవులకు నిలయం పశ్చిమ ప్రకాశం

పశ్చిమ ప్రకాశం ప్రాంత కవులు 'నెల నెలా వెన్నెల' కార్యక్రమం పేరుతో కవితా గోష్టులు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తున్నారు. ఇందులో ప్రధానంగా డాక్టర్ కప్పగంతుల మధుసూదనశాస్త్రి, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, పీ శ్రీనివాస ప్రసాద్, ఎంవీ సుబ్బారావు, తోట శ్రీనివాసరావు, డాక్టర్ పీబీవీ ప్రసాద్, గోపాలుని రమేష్ బాబు, కొణతం రమణారెడ్డి, కాశంరాజు వేణుగోపాల్ తదితరులు తమ రచనల ద్వారా సాహితీ సేద్యం చేస్తున్నారు.

విద్య, సాహితీ రంగాల్లో బహుముఖ ప్రజ్ఞ


డాక్టర్ మధుసూదన్‌శాస్త్రి

సాధనా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ కప్పగంతుల మధుసూదన శాస్త్రి తెలుగు సాహిత్యంపై 200కు పైగా చేసిన రచనలు, వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 130కి పైగా ఆకాశవాణిలో ఉపన్యాసాలు ప్రసారమయ్యాయి. సుమారు 50 తెలుగు సాహిత్య సభల్లో ప్రసంగించారు. విద్యారంగంలో చేస్తున్న కృషికి గానూ విద్యా రత్న అవార్డు, లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2021లో ఆసియా పసిఫిక్ అవార్డు, 2019లో బెస్ట్ ప్రిన్సిపాల్‌గా అప్పటి కలెక్టర్ ద్వారా అవార్డు అందుకున్నారు. ఇంకా 'బతుకు బండి' పేరుతో స్వీయ కవితా సంపుటి, కరుణశ్రీ సాహిత్యంలో మానవత్వం, ప్రకాశం జిల్లాలో అవధాన కళపై రెండు పరిశోధనా గ్రంథాలను రచించారు. ఈయన ప్రకాశం జిల్లాలో అవధాన కళపై డాక్టరేట్ పొందారు.

శతకాల రచయిత అన్నపురెడ్డి


డాక్టర్ వీరారెడ్డి

వయోజన విద్యాశాఖలో రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా రిటైర్డ్ అయిన డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి తెలుగు సాహిత్యంలో అక్షర సేద్యం చేస్తున్నారు. వంద రోజుల్లో తెలుగు నేర్చుకోవడం ఎలా అనే పుస్తకం ఇతర రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందింది. సుమారు 5 లక్షల మంది ఈ పుస్తకాన్ని చదివినట్లు అంచనా. 2001–02లో ఈ పుస్తకం ప్రచురితం కాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఇంకా అక్షర సరాలు, అక్షర ప్రస్థానం, అక్షరానికి రెక్కలొస్తే, అక్షర వాచకాలు, వయోజన విద్య సాహిత్యం, అక్షరాభిషేకం, అక్షర వాణి సంపుటాలను రాసి తెలుగు భాషా సాహిత్య వికాసానికి తనవంతు కృషిచేస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో గ్రామ నామాలపై లోతైన పరిశోధన చేసి పుస్తక రూపంలోకి తెస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం ఆకాశవాణిలో ధారావాహికగా ప్రసారమవుతోంది. ఇవి కాక ఆంజనేయ శతకం, జొన్నలగడ్డ జంగమేశ్వర శతకం, కపిలగిరి నరసింహస్వామి శతకం, బొమ్మలాపురం వీరభద్ర శతకం, గిద్దలూరు పాతాళ నాగేశ్వర శతకం, దేవరాజుగట్టు కాశీనాయన శతకం రచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సాహితీ స్వచ్ఛంద సంస్థలు ఆయనను అక్షర తపస్వి, మహోపాధ్యాయ బిరుదులతో సత్కరించాయి.

వ్యాసావళిలో దిట్ట 'తోట'


తోట శ్రీనివాసరావు

మార్కాపురం పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న తోట శ్రీనివాసరావు తెలుగుభాషా ఔన్నత్యాన్ని కాపాడేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. రేపటి సూరీడు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర శతకం, వ్యాసావళి, బొడిచర్ల ఆంజనేయస్వామి శతకాన్ని రచించారు. తెలుగు పాటలను సేకరించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించారు.

తెలుగంటే ప్రాణం


ఎంవీ సుబ్బారావు

మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎంవీ సుబ్బారావుకు చిన్నప్పటి నుంచి కవితలు రాయడమంటే ఇష్టం. ఒక అంశంపై అప్పటికప్పుడు అలవోకగా కవితలు రాస్తుంటారు. బాలాత్రిపురసుందరీ, చెన్నకేశవస్వామి, బొడిచర్ల ఆంజనేయస్వామిపై శతకాలు రాశారు. ఆకాశవాణి కేంద్రంలో తెలుగు సాహిత్యంపై ఆయన రచించిన కవితలు సుమారు 30 వరకు ప్రసారమయ్యాయి.

పద్యకవిగా గుర్తింపు


శ్రీనివాసప్రసాద్

స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న పీ శ్రీనివాస ప్రసాద్ పశ్చిమ ప్రకాశంలో పద్యకవిగా గుర్తింపు పొందారు. దీనితోపాటు శాసనాలను పరిశోధించి వాటి ప్రాశస్త్యాన్ని, ప్రాధాన్యతను ప్రజలకు చెప్పడంలో ముందున్నారు. తన రచనల ద్వారా సమాజంలోని మూఢ నమ్మకాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. శతకాలలో మహారాజు శతకం, తెలుగుబిడ్డ, త్రిపుర హరేశా, బొల్లికొండరాయ శతకం, బొల్లికొండరాయ సీస పద్యాలు రచించారు.

మాతృభాషాభివృద్ధి ప్రభుత్వం విశేష కృషి

15 శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. అందులో భాగంగా ఏటా కవులకు ఉగాది పురస్కారాలు అందజేయడంతోపాటు తెలుగు భాషోత్సవాలు నిర్వహిస్తూ కవులను ప్రోత్సహిస్తోంది. జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా మాతృభాషలో విద్యాబోధనను ప్రవేశపెట్టింది. ఒకవైపు ఇంగ్లిష్ మీడియంను ప్రోత్సహిస్తూనే.. మాతృభాషకు అంతకంటే ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తోంది. ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో కూడా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యను త్వరగా నేర్చుకునే అవకాశముంది. వీటితోపాటు ఉపాధి కోర్సుల్లో కూడా తెలుగును అమలు చేస్తోంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- స్పందనలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్పందన భవనంలో సోమవారం స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంతో నమ్మకంతో ప్రజలు అధికారుల వద్దకు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తారని కాబట్టి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా పరిష్కారం చేయాలన్నారు. ఏదైనా పరిస్థితిల్లో సమస్య పరిష్కరించలేకుంటే అర్జీదారులకు వివరించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీలత, డిప్యూటీ కలెక్టర్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

■ ఒంగోలు చెందిన ఎన్ రమేష్ స్పందనలో అధికారులను కలిసి తాను కోవిడ్ సమయంలో అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు కోవిడ్ సేవలందించేందుకు వచ్చిన ఐటీఐ విద్యార్థులకు భోజనం సరఫరా చేశానని, అందుకు రూ.1.79,700 బిల్లు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. అడిగితే డీఎంహెచ్ కార్యాలయంలో కార్యాలయంలో ఇస్తారని, అక్కడేమో జీజీహెచ్ చెల్లిస్తుందని చెప్పున్నట్లు తెలిపాడు. బిల్లు త్వరగా ఇప్పించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అర్జీ అందచేశాడు.

■ఓఎంసీ పరిధిలో స్వీపర్‌లుగా పనిచేసే పలువురు స్పందనలో అధికారులను కలిసి గత 22 ఏళ్లుగా నగరపాలక పాఠశాలల్లో పార్ట్‌టైమ్ కంటింజెంట్ స్వీపర్‌లుగా పనిచేస్తున్నామని, నెలకు రూ.4వేలు జీతం ఇస్తున్నా రోజు మొత్తం పనిచేయించుకుంటున్నారన్నారు.

అయితే 8నెలలుగా జీతం కూడా ఇవ్వడం లేదని అర్జీ అందచేశారు. కార్పొరేషన్‌లో అడిగితే డీఈఓ కార్యాలయంలో ఇస్తారని చెప్పారని, అయితే పరిశీలించి తమకు వేతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబు దాష్టీకానికి నిదర్శనం..
బషీర్‌బాగ్ కాల్పుల ఉదంతం


బషీర్‌బాగ్ అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నాటి చంద్రబాబు పాలనలోని టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై మోపిన పెనుభారానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో నేలకొరిగిన అమరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణు వర్ధన్‌రెడ్డి, బాలస్వామి సంస్మరణ సభను స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించారు. సభకు సీనియర్ నాయకుడు కంకణాల ఆంజనేయులు అధ్యక్షత వహించగా హనీఫ్ ప్రసంగించారు. విద్యుత్ ప్రైవేటీకరణ పేరుతో ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం నిరుపేదలు, రైతులపై అనేక దౌర్జన్యాలకు పాల్పడిందని గుర్తుచేశారు. ఆకాశన్నంటేలా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను నానా ఇబ్బందులు పెట్టిందని తెలిపారు. నాడు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నేతృత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేసినట్లు తెలిపారు. 100 రోజుల పాటు జరిగిన విద్యుత్ పోరాటంలో చివరిగా ఆగస్టు 28న బషీర్‌బాగ్ వద్ద నిరసనకారులపై పోలీసుల కాల్పులు జరపడంతో సీపీఎం కార్యకర్తలు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన బాలస్వామి మరణించారని తెలిపారు. అనేక మంది గాయపడ్డారని తెలిపారు. దాంతో ప్రజల ముందు తెలుగుదేశం పార్టీ దోషిగా నిలబడిందన్నారు. ఆనాటి నుంచి నేటి దాకా వచ్చిన ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచేందుకు సాహించలేదని చెప్పారు. నేడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై మోయలేని భారం వేస్తోందని విమర్శించారు. బషీర్ బాగ్ ఉద్యమం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి చెప్పారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రమాదేవి, పి.కల్పన, షేక్ మహబూబ్, చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, మస్తాన్, గంధం నరసయ్య, నరసింహారావు, సయ్యద్ హుసేన్, గురుస్వామి, అమీర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షకీలా


ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌తో ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

దర్శి: దర్శి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ హాజరు కాగా ఘన స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా షేక్ షకీలా, వైస్ చైర్మన్‌గా కండెగంగయ్య, మెంబర్లుగా భవనం మురళీకృష్ణారెడ్డి, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నరసమ్మ, అడ్డగిరి వెంకటనారాయణ, అడుసుమల్లి రాజ్యం, శాగంరోశమ్మ, లవనూరి సుబ్బులు, షేక్ రసూల్‌బాషా, దాసరి ఏలియా, ముక్తిపూడి జెమీమా, దేవరకొండ వెంకటేశ్వర్లు, గంజి వెంకటేశ్వరరెడ్డి, షేక్ నసీమాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో దర్శి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించారని చెప్పారు. దర్శి–కురిచేడు రోడ్డు, డిగ్రీ కళాశాల,అర్బన్ క్లీనిక్, అగ్రీ ల్యాబ్, గోడౌన్‌లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రతి మండలంలో చిన్న చిన్న గ్రామాల్లో వారికి కూడా పదవుల్లో అవకాశాలు ఇచ్చామని చెప్పారు. రూ.121 కోట్లతో తాగునీటికి టెండర్లు కూడా వేశామని, అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లూరు మండల ఇన్‌చార్జి రవీంద్ర, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్‌బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ విమల రామకృష్ణ, ఎంపీపీలు సుధాఅచ్చయ్య, శ్రీనివాసరావు, బెల్లం కోటేశ్వరమ్మ, సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఎదురు కోటిరెడ్డి, యాడిక శ్రీనివాసరెడ్డి, మేరువ సుబ్బారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు మారం వెంకారెడ్డి, సుధాకర్ వైస్ ఎంపీపీలు ప్రియాంక నాగార్జునరెడ్డి, కొరివి మునలయ్య, కౌన్సిలర్లు బాబూరావు, మోహన్‌బాబు, జిల్లా ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్రిప్టోకరెన్సీ పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేసిన యువతి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టడం వల్ల ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు పంపిన ఒక మెసెజ్ ఆమె బ్యాంకు ఖాతాను ఖాళీ చేసేసింది. ఒంగోలు నగరానికి చెందిన ఒక యువతి స్నేహితురాలి ఇన్‌స్ట్రాగామ్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె అకౌంటు నుంచి క్రిప్టోకరెన్సీలో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తున్నాయని ఒక లింకును పంపించారు. నిజమని నమ్మిన సదరు యువతి తొలుత రూ.10వేలు పంపించింది. అప్పుడు ఆ యువతి బ్యాంకు అకౌంటును హ్యాక్ చేసిన నేరగాళ్లు ఆమె బ్యాంకులో ఉన్న మొత్తం డబ్బులను కాజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన సదరు యువతి ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే రాంసస్ కంపెనీ మెడికల్ డిస్ట్రిబ్యూషన్ ఇస్తానని నమ్మించిన అవతి ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్ రాజేష్ మోసానికి పాల్పడినట్లు కనిగిరికి చెందిన వెంకట మనోజ్ ఫిర్యాదు చేశారు. తన వద్ద నుంచి విడతల వారిగా రూ.7,8100 రుపాయలను తీసుకొని స్టాక్ పంపించలేదని, తిరిగి తన డబ్బులు ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా వేధిస్తున్నాడని వాపోయారు. మొత్తం 78 ఫిర్యాదులు రాగా నేరుగా ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదుల గురించి అడిగి తెలుసుకొని చట్టపరంగా వాటిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు ఆశించిన లాభాలు

- గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పెరిగిన ధరలు
- వచ్చే ఏడాది ఈ ధరలు వస్తాయని మాత్రం ఆశించవద్దు
- బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయండి


పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న బోర్డు సభ్యులు, రైతులు

చీమకుర్తి: అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న పరిస్థితుల కారణంగా పొగాకు రైతులు ఈ ఏడాది మంచి లాభాలు ఆర్జించారని టుబాకో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు–1 వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఈడీ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు, రైతులు, పొగాకు కంపెనీల బయ్యర్లను ఉద్దేశించి ఈడీ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఈ ధరలు ఉండొచ్చు, ఉండకపోవచ్చని, బోర్డు ఆదేశాల మేరకు అనుమతించిన మేరకే రైతులు పొగాకు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది సరాసరి ధర రూ.170.17 మాత్రమే కాగా ఈ ఏడాది రూ.219.65 పలికిందన్నారు. చూర కేజీ రూ.91.60 పలికిందని తెలిపారు. రైతులు ఈ సంతోషంలో రానున్న ఏడాది ఎక్కువ సాగు చేసి నష్టాలకు గురి కావద్దని హితవు పలికారు. ఈ ఏడాది 142 మిలియన్ కేజీల వరకు పొగాకు పండించేందుకు బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. అనంతరం ఈడీ శ్రీధర్‌ను బోర్డు సభ్యులు, రైతులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు సెక్రటరీ డి.వేణుగోపాల్, బోర్డు ఆర్ఎం ఎం.లక్ష్మణ్‌రావు, మారెడ్డి సుబ్బారెడ్డి, బొడ్డపాటి బ్రహ్మయ్య, పి.వరప్రసాదరావు, పొగాకు కంపెనీల మేనేజర్లు శివకుమార్, ప్రభాకర్, రైతు నాయకులు సూరం గురవారెడ్డి, ఆళ్ల సుబ్బారావు, మేకల కృష్ణారెడ్డి, చెంచురామయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ పైనుంచి పడి డ్రైవర్ మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: లోడ్ లారీపై నిద్రపోతున్న డ్రైవర్ జారిపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలం లోని తూర్పునాయుడుపాలెం వద్ద పొగాకు కంపెనీ గోడౌన్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మద్దిపాడు మండలం అన్నంగి గ్రామానికి చెందిన తేళ్ల కోటేశ్వరరావు(38) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కోటేశ్వరరావు మరో డ్రైవర్‌తో కలిసి మైసూర్ పొగాకు బేళ్ల లోడుతో మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామ జాతీయ రహదారి పక్కన్న ఉన్న ఆంజనేయ టుబాకో ఎంటర్‌ప్రైజెస్ వద్దకు ఆదివారం రాత్రి వచ్చాడు. లోడ్ లారీపై పడుకోగా.. తెల్లవారుజామున నిద్ర మత్తులో కింద పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. మృతుడి అన్న తేళ్ల బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.